క్లుప్తంగా

వైభవంగా చక్రతీర్థ స్నానాలు



ఉమాకామేశ్వర స్వామికి చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తున్న అర్చకులు, కన్నెపల్లి వంశీకులు

నరసన్నపేట: మండలంలోని వంశధార నదీ తీరంలో ఉమాకామేశ్వర స్వామి వారి చక్రతీర్థ స్నానాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ప్రతి ఏటా కన్నెపల్లి వంశీకులు, గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చక్రతీర్థ స్నానాలు నిర్వహించారు. కామేశ్వరిపేట, లుకలాం గ్రామాలకు చెందిన ప్రజలతోపాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లుకలాం వద్ద వంశధార తీరం జనాలతో నిండింది. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, లుకలాం సర్పంచ్ తవిటినాయుడు, మాజీ సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చింతల వెంకటరావు, మాజీ సర్పంచ్ చింతల సత్యం తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: స్థానిక వైఎస్సార్ కూడలి నుంచి మారుతీనగర్ మొదటి వీధిలో రూ.31 లక్షలతో చేపట్టనున్న రోడ్డు పనులను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం ప్రారంభించారు. గొట్టిపల్లి ఫ్లైఓవర్ వరకు రోడ్డు పనులు పూర్తిచేస్తామని కృష్ణచైతన్య తెలిపారు. ఎంపీపీ మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, పాగోటి రాజారావు, పొన్నాన దాలినాయుడు, చీపురు కృష్ణ, రఘుపాత్రుని రఘు, బుడ్డల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ముల పంపిణీ



డ్రమ్ములను అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సారవకోట: సారవకోట, జలుమూరు మండలాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే 20 మంది ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డ్రమ్ములను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుడితి పీఏసీఎస్ ఆవరణలో ఆదివారం పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు నీమాస్త్రం, ద్రవ జీవామృతం, జిల్లేడు ద్రావణాలు తయారు చేసేందుకు వీలుగా 100, 200 లీటర్ల పరిమాణం గల డ్రమ్ములు అందజేసినట్లు ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ తోట రమణ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మరో రూ.10 వేల విలువ గల విత్తనాలు, టార్పాలిన్లు, డ్రమ్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ డ్రమ్ములను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలన్నారు.

76 మందికి కంటి పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మండల కేంద్రంలో వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 76 మందికి శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అసిస్టెంట్లు బి.భారతి, దివాకర్ కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 28 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని శ్రీకాకుళం రిఫర్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంప్ కో ఆర్డినేటర్ రామారావు ఉన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న రామరాజు, బాబూరావు

పాతపట్నం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు మాట్లాడుతూ దేశ మొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే పనిచేశారన్నారు. రచయితగా పలు సేవలు అందించారన్నారు. కులమత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన వ్యక్తి పూలే అని కొనియాడారు. ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబూరావు, భుజింగరావు, నవజీవన్ వసతి గృహం విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



సారవకోట: మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- నరసన్నపేట, సారవకోటలో చేయూత సంబరాలు

నరసన్నపేట: మహిళల అభివృద్ధికి, సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రం నరసన్నపేటలోని పైడితల్లి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన చేయూత సంబరాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలు, ఆశలకు అనుగుణంగా పాలన చేశామన్నారు. ఈ ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధిని, అందించిన పథకాలను వివరించారు. చేయూత పథకం ద్వారా మండలంలో 6158 మందికి రూ.11.54 కోట్లు మహిళల ఖాతాల్లో వేశామన్నారు. ఆసరా కింద ఇప్పటికే నాలుగు మండలాల్లో రూ.45 కోట్లు అందించామన్నారు. చంద్రబాబుకు ఓటు వేసి చంద్రముఖిని మళ్లీ బయటకు తీసుకురావద్దని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ అవినీతి లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ రావాలన్నారు. టీడీపీ వాళ్లు చేస్తున్న మోసపూరిత ప్రకటనలు, హామీలను ప్రజలు నమ్మవద్దని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రాజాపు హైమావతి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు దాలినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, చింతు రామారావు, బార్ల వేణుగోపాలరావు, బొబ్బాది ఈశ్వరరావు, పుట్టా ఆదిలక్ష్మి, గుప్త తదితరులు పాల్గొన్నారు.



సారవకోట: చేయూత సంబరాల్లో పాల్గొన్న మహిళలు



నరసన్నపేట: ఫ్యాన్ గుర్తును మహిళలకు చూపుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలి..

సారవకోట: మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల పరిషత్ ఆవరణలో నాల్గో విడత చేయూత కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆదివారం చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలన్ని మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నామన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించినప్పుడే ఆ కుటుంబం బాగు పడుతుందన్నారు. చేయూత ద్వారా మండలంలో 4128 మందికి రూ 8.26 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఏల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, వైస్ ఎంపీపీలు గుణుపురం రామారావు, ఎడ్ల అసిరయ్య, సర్పంచ్‌లు కోరుకొండ శంకరబాబు, సాధు సతీష్, బాడాన కృష్ణారావు, సాగిపల్లి దండాశి, జన్ని అనిరుద్రుడు, కొండాల బాబూరావు, ఇసై షణ్ముఖరావు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు వరుదు దేవీ ప్రసాద్, యాళ్ల శ్యామసుందరరావు, నిక్కు రాజశేఖర్, నిక్కు కృష్ణారావు, బోర శ్రీరామ్మూర్తి, రావాడ శ్రీనివాసరావు, అప్పయ్య, కింజరాపు ధర్మారావు, కాళ్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

డీపీఎల్ సీజన్-5 క్రికెట్ టోర్నీ విజేత కొత్తూరు



ట్రోఫీ అందజేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: శివరాత్రి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన డీపీఎల్ సీజన్-5 క్రికెట్ టోర్నీ విజేతగా కొత్తూరు జట్టు నిలిచింది. శివరాత్రి రోజున రాత్రి కురిసిన వర్షానికి మ్యాచ్ నిర్వహణ నిలిచిపోయింది. దీంతో సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్ సత్యవరం -కొత్తూరు జట్లు మధ్య జరిగింది. తొలిత బ్యాటింగ్ చేసిన సత్యవరం ఆరు ఓవర్లలో 54 పరుగులు చేసింది. కొత్తూరు ఐదు ఓవర్లలోనే నిర్దేశిత లక్ష్యాన్ని చేధించి టోర్నీ విజేతగా నిలిచింది. టోర్నీ విజేతకు ట్రోఫీతోపాటు రూ.50 వేల నగదు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీతో రూ.25 వేలు నగదు బహుమతులను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య ట్రోఫీలు అందించారు. మొత్తం 32 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్ ప్రశాంతంగా నిర్వహించిన ఆర్ఎస్‌సీఏ సభ్యులకు కృష్ణచైతన్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరలి శంకర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు రమణ సాహు, ఎంపీటీసీ డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, అవ్వ రవి, ఆర్ఎస్‌సీఏ సభ్యులు పెదిరెడ్ల రాము, నక్క రాము పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



ఆమదాలవలస రూరల్: రక్తదానం చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



పొందూరు: రక్తదానం చేస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారికి ప్రాణాలు కాపాడాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా యూత్ కో ఆర్డినేటర్ ఎ.శివకుమార్ పిలుపునిచ్చారు. మండలంలో అక్కులపేటలో గల సత్యసాయి సేవా సమితి మందిరంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు రావన్నారు. 21 మంది యువకులు రక్తదానం చేయడంతో వారిని సత్యసాయి సేవా సమితి సభ్యులు అభినందించారు. సత్యసాయి సేవా సమితి జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, జిల్లా యూత్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ, జ్యోతి, విద్యాజ్యోతి ఇన్‌చార్జ్‌లు శశికాంత్, స్వరూప్, లిఖిల్, చరణ్, పవన్, నదియా, షణ్ముఖ, శ్రీదేవి, సంజన, వెంకటరావు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

తోలాపిలో..

పొందూరు: మండలంలోని తోలాపి గ్రామంలోని సత్యసాయి సేవా మందిరంలో సత్యసాయి సేవా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. 23 మంది సత్యసాయి భక్తులు రక్తదానం చేశారు. శ్రీకాకుళం విజయ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు, జోనల్ కన్వీనర్ జగన్మోహన్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతికి వినతిపత్రం అందజేసిన ఉద్యోగులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీశాక్స్ ఉద్యోగులు

పాతపట్నం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశాక్స్)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ విధానంలోనికి తీసుకురావడాన్ని నిలుపుదల చేయాలని ఐసీటీసీ కౌన్సిలర్లు జి.బాబూరావు, త్రివేణి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీశాక్స్ ఉద్యోగుల సమస్యను ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసినవారిలో పి.సుధాకర్, సి.హెచ్.ప్రసాద్, శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు, కె.లత ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పాతపట్నం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఆనందంగా జీవించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆదివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల జీవనకాలం పెరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్యశ్రీ సేవలను వినియోగించుకోవాలన్నారు. పాతపట్నం, హిరమండలం మండలాల్లో ఉన్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు (ఎయిడ్స్) పౌష్టికాహారం అందజేశారు. వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదన్నారు. డీఆర్పీ నాగభూషణరావు, వైద్యులు శివ కుమార్, గ్రీష్మ, ఐసీటీసీ కౌన్సిలర్లు బాబూరావు, త్రివేణి, ఎంఎస్ఎంయూ డైరెక్టర్ వై.వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, నీలమణిదుర్గ ఆలయ చైర్మన్ ఎస్.ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రవీణ్, సూపర్‌వైజర్లు సుధాకర్, ప్రసాద్, శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు, లత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని కొల్లివలస కేజీబీవీలో 2024-25 విద్యా సంవత్సరానికి 6, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.గాయత్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనాథులు, డ్రాపౌట్స్, ఎస్టీ, ఎస్సీ, బీసీ మైనార్టీ, దారిద్రరేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. పరిశీలన అనంతరం ఎంపికైన వారి ఫోన్ నంబర్లకు మెసేజ్ చేస్తామన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 18004258599ను సంప్రదించాలన్నారు. కుటుంబ ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షల లోపు ఉండాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాద్

బూర్జ: సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు మండలంలోని ప్రజలు సహకరించాలని స్థానిక ఎస్ఐ ప్రసాద్ అన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోబాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం

ఆమదాలవలస రూరల్: మండలంలో చీమలవలసలో పశువైద్య భవనాన్ని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ప్రారంభించనున్నారని స్పీకర్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొరపాంలో గ్రామ సచివాలయాన్ని, నెల్లిపర్తిలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని కోరారు.

భగత్‌సింగ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



అనాథ చిన్నారులకు చెక్కును అందిస్తున్న డాక్టర్ శశిధర్, ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండలానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజలకు అందిస్తున్న పలు రకాల సేవలు అభినందనీయమని వైద్యాధికారి అగతమూడి అప్పలనాయుడు అన్నారు. కొత్తూరులో ఆదివారం నిర్వహించి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 250 మందికి వైద్య నిపుణులు అన్నెపు శశిధర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితం మందులు పంపిణీ చేశారు.

ఆర్థికసాయం..

మండలంలోని సిరుసువాడకు చెందిన పాత్రో హేమసుందరరావు, జాబిలి దంపతులు ఇటీవల మృతి చెందారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. వారు అనాధులయ్యారు. ఈ విషయం భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు దృష్టికి రావడంతో ట్రస్టు తరఫున ఇద్దరు చిన్నారులకు రూ.15 వేల చెక్కును అందజేశారు. డాక్టర్ అన్నెపు శశిధర్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతగా డిజిటల్-వెల్ఫేర్ అసిస్టెంట్ టీమ్



క్రికెట్ పోటీ విజేతలు

కొత్తూరు: మండలంలోని గ్రామ సచివాలయం ఉద్యోగుల క్రికెట్ ప్రిమియర్ లీగ్ పోటీలను మెట్టూరులో రెండు రోజులుగా నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ పర్యవేక్షించారు. 11 టీమ్‌లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డిజిటల్- వెల్ఫేర్ అసిస్టెంట్ టీమ్ విన్నర్‌గా నిలిచారు. రన్నర్‌గా ఇంజినీరింగ్ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మెన్ టీమ్ నిలిచాయి. విన్నర్స్‌కు రూ.6 వేలు, రన్నర్స్‌కు రూ.3 వేలు నగదు అందజేశారు. ఈ పోటీలు సచివాలయ ఉద్యోగులు అల్లు తిరుపతిరావు, జగపతిబాబు, నవీన్, మిన్నారావు, పృథ్వీ, మోహన్ ఆధ్వర్యంలో జరిగాయి.

762 మందికి వైద్య సేవలు



లబ్బలో వైద్య సేవలను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక



మహార్తాపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ రాధిక

కొత్తూరు: మండలంలోని లబ్బ గ్రామ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో కమ్యూనిటీ పోలీసింగ్ పేరుతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత శిబిరాన్ని ఎస్పీ జీఆర్ రాధిక ఆదివారం ప్రారంభించారు. రాగోలు జెమ్స్ వైద్య నిపుణులు, మెట్టూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు 762 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి లబ్బ, ఒంద్రుజోల, కారిగూడ, బొట్టిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన గిరిజనలు హాజరయ్యారు. కొత్తూరు ఎస్ఐ ఎం.ఎ. అహమ్మద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం జరిగింది. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాలరావు, హిరమండలం ఎస్ఐ నారాయణ స్వామి పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు ట్రోఫీ అందజేత..

కొత్తూరు పోలీస్‌లు నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విన్నర్‌గా నిలిచిన మహార్తాపురం జట్టుకు ఆదివారం లబ్బ గ్రామంలో ఎస్పీ జీఆర్ రాధిక ట్రోఫీ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. కమ్యూనిటీ పోలీసింగ్ పేరుతో నిర్వహిస్తున్న ఇటువంటి పోటీల్లో క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబర్చాలన్నారు. క్రీడల్లో రాణించినవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు.

ప్రజాసంక్షేమానికి అధిక ప్రాధాన్యం



ఎల్.ఎన్.పేట: సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ సాంబశివరావు



కొత్తూరు: కరపత్రాలు అందజేస్తున్న సారిపల్లి ప్రసాదరావు, పార్టీ నాయకులు

ఎల్.ఎన్.పేట: ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు అన్నారు. మండలంలోని గొట్టిపల్లిలో ఆదివారం మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంచుతూ ప్రజలు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు గెలిపిస్తే మరిన్ని పథకాలు అమలు చేస్తారన్నారు. కొమ్మువలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి సీతారాం, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కడుములో..

కొత్తూరు: మండలం కడుము గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు గడప గడపకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసన్నపేటను అభివృద్ధి చేశాం

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- కుల సంఘాలతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: తనకు ఇంత గౌరవం, పదువులు వచ్చాయంటే దీనికి ప్రధాన కారణం నరసన్నపేట నియోజకవర్గ ప్రజలు, ప్రధానంగా నరసన్నపేట పట్టణ ప్రజలేనని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో పట్టణంలో ఉన్న పలు కుల సంఘాల ప్రతినిధులతో ఆదివారం ఆత్మీయ సమావేశాన్ని శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా తనను ఆదరిస్తూ వచ్చారని, ఈ సారి కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. నరసన్నపేటను ఎంతో అభివృద్ధి చేశానని, ఇక్కడ ప్రజలకు మౌలిక వసతులు కల్పించానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలో ఉన్న కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, చింతు రామారావు, తంగుడు జోగారావు, పాట్నూరు ప్రసాదరావు, వైశ్యరాజు కేశవరాజు, బోయిన బాలకృష్ణ, గొండు స్వామిబాబు, పూర్ణారావు, ఎస్.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు పౌర సన్మానం



తోటవాడలో సైనికులను సన్మానిస్తున్న గ్రామస్తులు

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామానికి చెందిన మాజీ సైనికులు, ప్రస్తుతం సైన్యంలో పనిచేస్తున్నవారికి జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పెద్దలు, యువత, పౌర సన్మానం చేశారు. తోటవాడలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ నుంచి సుమారు 75 మంది వరకు మాజీ సైనికులు, చాలా మంది సైనికులుగా విధులు నిర్వహిస్తున్నారని పూర్ణచంద్రరావు తెలియజేశారు. రిటైర్డ్ జడ్జి కంది విజ్ఞాన్ మాట్లాడుతూ దేశానికి సేవలు అందించిన వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రమౌలీశ్వరరావు, జనరల్ సెక్రటరీ పి.మురళీధరరావు, మాజీ సైనికులు దన్నాన ఆనందరావు, గేదెల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపు నిస్తాయి



బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ చంద్రకుమారి, హేమలతను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మెళియాపుట్టి: ఉద్యోగికి సేవలే గుర్తింపునిస్తాయని జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. ఇటీవల ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీ అయిన ఎంపీడీఓ చంద్రకుమారి, సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ.. శ్రీకాకుళం డ్వామా కార్యాలయానికి పదోన్నతిపై వెళ్లిన హేమలతను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎండయ్య మాట్లాడుతూ.. ఎంపీడీఓ చంద్రకుమారి సొంత మండలం మెళియాపుట్టి అని, రెండు దఫాలుగా మండలంలో పనిచేశారన్నారు. మండల పరిపాలనాధికారి తిరుపతి పట్నాయక్, కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.